ప్రజాశక్తి
శనివారం 16 మార్చి 2024
5
అనంతపురం

ఈనాం కాదు... వేలం ద్వారా కొనాలి

మార్కెట్‌యార్డు ఛైర్మన్‌కు చీనీరైతుల వినతి

చీనీ పంటను ఈనాం పద్ధతిలో కాకుండా వేలం పాట ద్వారానే కొనుగోలు చేయాలని చీనీ పండ్ల తోటల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నాడు మార్కెట్‌యార్డులో ఛైర్మన్ ఫయాజ్ బాషా, కార్యదర్శి జయలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలోనే అత్యధికంగా చీనీ పంట దిగుబడి వచ్చేది అనంతపురం జిల్లాలోనే అన్నారు. ఇక్కడ పంట కొనుగోలు ఒక రహస్యంగా సాగుతోందన్నారు. ఉన్న కొద్ది మంది వ్యాపారులు నిర్ణయించినదే ధర అవుతోందన్నారు. ఈనామ్ పద్ధతిలో అయితే బయట నుంచి వ్యాపారులెవరూ ఎందుకు కొనడం లేదన్నది పరిశీలించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన దానికంటే కమీషన్ అధికంగా రైతుల నుంచే వసూలు చేస్తున్నారని చెప్పారు. మార్కెట్‌యార్డులో ఇప్పుడున్న సౌకర్యాలు సరిపోవని, మరిన్ని షెడ్ల నిర్మాణంతోపాటు, కోల్డ్ స్టోరీజీల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి మార్కెట్‌యార్డు ఛైర్మన్ స్పందిస్తూ ఈనామ్ విధానం ఇక్కడ మాత్రమే తీసుకొచ్చింది కాదని, 2016లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇప్పుడు రైతులు ఇచ్చిన అభ్యర్థన మేరకు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతామని హామీనిచ్చారు. అదనపు షెడ్ల నిర్మాణం చేపట్టే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి పండ్ల తోటల రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి , పండ్లతోటల సంఘం నాయకులు అనంత రాముడు, ఆకుతోటపల్లి నారాయణరెడ్డి, నారపరెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరామిరెడ్డి, చెన్నారెడ్డి, ఆనంద్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న పండ్ల తోటల , రైతుసంఘం నాయకులు



ఈనాంకు సున్నం..!

◆ పది లక్షల టన్నులకు 12 మంది కొనుగోలుదారులు
◆ ముఖ్యమంత్రి సొంత జిల్లా మార్కెట్‌యార్డులో వేలం
◆ 'అనంత'లో ఈనాం పద్ధతిలో చీనీ పంట కొనుగోలు
◆ వద్దే వద్దంటున్న రైతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రైతులకు మేలు చేస్తామంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల కొనుగోలుకు తీసుకొచ్చిన ఈనాం పద్ధతికి వ్యాపారులు, అధికారులు కలిసి సున్నం పెట్టారు. ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచి అయినా పంట కొనడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని ఈ పద్ధతిని 2016లో కేంద్రంలోని బిజెపి అమల్లోకి తీసుకొచ్చింది. ఈ విధానం వ్యాపారుల పాలిట వరంగా మారిందని చెప్పవచ్చు. గతంలో వేలంలో ఒకరిద్దరు వ్యాపారులైనా పోటీ పడేందుకు అవకాశం ఉండేది. ఇప్పుడు ఈనామ్ పద్ధతిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు, బయటి వ్యక్తులెవరూ కొనుగోలుకు రాకుండా ఇక్కడున్న వ్యాపారులే మేనేజ్ చేస్తూ రైతులను నిలువునా ముంచేస్తున్నారు. స్థానిక వ్యాపారులు నిర్ణయించేందే ధర అవుతోంది.

పది లక్షల టన్నులకు 12 మంది వ్యాపారులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 42,490 హెక్టార్లలో చీనీపంట ఉంది. ఏడాదికి రాష్ట్రంలోనే అత్యధికంగా దిగుబడి అనంతపురం జిల్లాలోనే వస్తుంది. ఇక్కడ ఏడాదికి సగటున పది లక్షల టన్నుల దిగుబడి చీని పంట వస్తుంది. ఇంత పెద్దఎత్తున పంట వచ్చే ఈ జిల్లాలో ఉన్న చీనీ మార్కెట్ అనంతపురం వ్యవసాయ మార్కెట్ ఒక్కటే. ఇక్కడ చూస్తే కేవలం 12 మంది వ్యాపారులు మాత్రమే మార్కెట్ శాఖ వద్ద రిజిస్టర్ అయ్యి ఉన్నారు. వీరు నిర్ణయించినదే ధరగా అమలు జరుగుతోంది. ఉత్తరాది వ్యాపారులు వచ్చినా నేరుగా కొనుగోలు చేయడానికి వీల్లేని పరిస్థితులున్నాయి. ఈ వ్యాపారుల వద్ద నుంచే కొనుగోలు చేసుకుని వెళ్తుండటం ఆనవాయితీగా మారింది. ఉన్న అతికొద్ది మంది వ్యాపారులు సిండికేట్ అవడంతో వారు నిర్ణయించినదే ధరగా మారుతోంది. కొత్త వ్యాపారులను రప్పించి కొనుగోళ్లు పెంచే విధంగా చూడాల్సిన మార్కెటింగ్ శాఖ మౌనంగా ఉంటూ అది తమ బాధ్యత కాదన్నట్టుగా ఉండటం గమనార్హం.

పనిచేయని సైన్ బోర్డు

ఈనాం పద్ధతిలో వ్యాపారం మొదలయ్యాక దేశంలో ఏ మార్కెట్‌లో చీనీ ధర ఎంతకు పోతోందన్నది ఎప్పటికప్పుడు సైన్‌బోర్డులో డిస్‌ప్లే అవుతూ ఉండాలి. కానీ అనంత మార్కెట్‌లో అలా జరగడం లేదు. గత సీజన్ నుంచి అది పనిచేయకుండా ఉంది. అధికారులు ఈ విషయాన్ని కూడా గుర్తించకపోవడం గమనార్హం. ఈ అంశంపై కార్యదర్శి జయలక్ష్మిని వివరణ కోరగా పనిచేస్తోందని చెప్పారు. పని చేయడం లేదని చెప్పగా ఆమె కింది స్థాయి ఉద్యోగినిని అడిగారు. కింది స్థాయి ఉద్యోగి పనిచేయడం లేదని చెప్పగా తన దృష్టికి తీసుకురావాలి కదా అని సదరు ఉద్యోగికి చెప్పడం గమనార్హం.

నాలుగు శాతం కమీషన్ అయితే పది శాతం వసూళ్లు..!

వ్యవసాయ మార్కెట్‌లో నాలుగు శాతం మాత్రమే కమీషన్ తీసుకోవాలని నిబంధనలున్నాయి. ఈ నిబంధనలను అధికారుల కళ్లెదుటే యధేచ్ఛగా వ్యాపారులు ఉల్లంఘించి పది శాతం వసూలు చేస్తున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం నాడు రైతులు మార్కెట్‌యార్డు ఛైర్మన్ ఫయాజ్ బాషా, కార్యదర్శి జయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. ఎవరూ ఇప్పటి వరకు ఫిర్యాదు ఇవ్వలేదు కాబట్టి చర్యలు తీసుకోలేదని. ఎవరైనా ఇస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని తెలపడం కొసమెరుపు. ఓవైపు రైతులు తమకు నష్టం జరుగుతోదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నా మార్కెట్‌యార్డు అధికారులు పట్టించుకోకుండా నిబంధనల సాకు చూపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఇక్కడేమో ఈనాం..పులివెందులలో వేలం..!

అనంతపురం మార్కెట్‌లో ఈనాం పద్ధతి కాకుండా వేలం ద్వారా చీనీ పంట కొనుగోళ్లు చేపట్టాలని రైతులు అడుగుతుంటే... అది ప్రభుత్వ నిర్ణయమని మార్కెటింగ్ శాఖ అధ్యక్షులు ఫయాజ్ బాషా, కార్యదర్శి జయలక్ష్మి చెబుతున్నారు. అయితే ఇందుకు భిన్నంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం పులివెందుల్లో వేలం పద్ధతిలోనే కొనుగోళ్లు సాగుతున్నాయి. ఇదే విధానాన్ని ఇక్కడా అమలు జరపని రైతులు అడుగుతుంటే మాత్రం నిబంధనలు అంటూ అధికారులు సమాధానం ఇస్తున్నారు. వేలంలో అయితే రైతుకు పంట ఏ ధరకు అమ్ముడుపోతోందన్న విషయం అయినా తెలిసే అవకాశముందని రైతులు చెబుతున్నారు. ఈనాం పద్ధతిలో ఎంతకు అమ్ముడుపోయిందన్న వివరాలు కూడా తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రూప్-1 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

◆ 17న ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు
◆ హాజరుకానున్న 11,597 మంది అభ్యర్థులు
◆ జిల్లాలో 33 పరీక్షా కేంద్రాలు

పరీక్షల నిర్వహణపై అధికారులతో మాట్లాడుతున్న మేయర్, డిఆర్వో తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రభుత్వం ఈనెల 17వ తేదీన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్రూప్- 1 పరీక్షల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. 11,597 మంది పరీక్షలు రాయనున్నారు. గ్రూప్-1 పరీక్షల నేపథ్యంలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం నాడు అనంతపురం కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, ఏఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ కె.శ్రీనివాసులు, సెక్షన్ ఆఫీసర్లు యోగేశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ కమిషనర్ మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ ఆదివారం ఏపీపీఎస్సీ, గ్రూప్-1 సర్వీసెస్ స్క్రీనింగ్ టెస్ట్ (ఆబ్జెక్టివ్ టైప్) పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షలను 17న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒక విభాగం, మధ్యాహ్నం 02 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షల కోసం జిల్లాలో 33 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. 11,597 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలియజేశారు. ఇందుకోసం 33 మంది లైజన్ ఆఫీసర్లు, 33 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. ఎక్కడా చిన్న తప్పు కూడా జరగకుండా పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక పరీక్ష కేంద్రాల్లో వెలుతురు, సీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి వసతి కల్పించాలన్నారు. కేంద్రాల వద్ద వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరగాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విధాలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపిసి వరప్రసాద్, ఎస్‌డిసిలు శంకరయ్య, ఆనంద్, డీపీఒ ప్రభాకర్ రావు, సిపిఒ అశోక్ కుమార్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జీవో ఇవ్వడంలో నిర్లక్ష్యం ఎందుకు..!

◆ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలపై ప్రభుత్వం స్పందించాలి ◆ కార్పొరేషన్, కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీస్కిల్డ్ వేతనాలను ఇవ్వాలని తొమ్మిది ఐఎఎస్ కమిటీలు ఇచ్చిన నివేదికను అమలు చేస్తూ జీవో ఇవ్వడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులకు తొమ్మిది మంది ఐఎఎస్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం నాడు అనంతపురం కార్పొరేషన్ కార్యాలయం వద్ద సిఐటియు మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం, ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి అక్కడి నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ వద్దకు వెళ్లారు. కలెక్టరేట్ గేట్లను మూసివేసి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు ఏటీఎం నాగరాజు, సిఐఇయు నాయకులు వెంకటనారాయణ మాట్లాడుతూ పారిశుధ్య ఇంజినీరింగ్ కార్మికులు 16 రోజుల నిరవధిక సమ్మె నిర్వహించడంతో ప్రభుత్వం చర్చలు జరిపిందన్నారు. ఈ చర్చల్లో ఇంజినీరింగ్ కార్మికుల వేతనాల అంశంపై సాంకేతిక కారణాలు చూపుతూ 9 మంది ఐఎఎస్ కమిటీని ఏర్పాటు చేసి నివేదిక కోరిందన్నారు. ఈ కమిటీ రెండు వారాల క్రితమే ప్రభుత్వానికి నివేదిక అందజేసిందని తెలియజేశారు. రెండు వారాలు గడుస్తున్నా ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్, సెమీస్కిల్డ్ వేతనాలను అమలు చేస్తూ జీవో విడుదల చేయకుండా జాప్యం చేస్తుందన్నారు. కమిటీ నివేదించిన జీవోలు విడుదల చేయడంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తోందని ప్రశ్నించారు. జీవోలు జారీ చేయని పక్షంలో మున్సిపల్ కార్మికులు మరోసారి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సెక్షన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లికార్జున, సంజీవ రాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు ఓబుళపతి, పోతలయ్య మురళి, ఎల్.ముత్తురాజు తిరుమలేష్, మహిళా కన్వీనర్ మంత్రి వరలక్ష్మితో పాటు జిల్లాలోని వివిధ మున్సిపాల్టీల మున్సిపల్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇంటర్ విద్యార్థిని మృతి

వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆసుపత్రి ముందు ఆందోళన

మృతిచెందిన అంకిత

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

నగరంలోని శ్రీనివాస న్యూరో ఆసుపత్రిలో ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన అంకిత (19) చికిత్స పొందుతూ శుక్రవారం పరిస్థితి విషమించి మృతిచెందింది. అయితే వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే... ఎ.నారాయణపురానికి చెందిన అంకిత మెదడులో గడ్డ ఉందని రెండు రోజుల క్రితం చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరారు. అయితే ఆరునెలలుగా చికిత్స కోసం ఆసుపత్రి చుట్టూ తిగురుతూ దాదాపు రూ.8లక్షలకు పైగా ఖర్చు చేశామని మృతురాలి తల్లిదండ్రులు వాపోయారు. అంత ఖర్చు చేసినా అఖరికి తమ కూతురు చనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బిడ్డకు రక్తం తక్కువగా ఉందని, రక్తం ఎక్కించే సమయంలో అది వికటించి మృతి చెందిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ బిడ్డ చనిపోయిందని ఆరోపించారు.

నేడు మూర్ఛవ్యాధి శిబిరం

రాయదుర్గం : పట్టణంలోని సమైక్యాంధ్ర భవన్‌లో శనివారం మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు జనవిజ్ఞాన వేదిక రాయదుర్గం శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రముఖ మూర్ఛవ్యాధి నిపుణులు డాక్టర్ గోపాలం శివనారాయణ హాజరై రోగులకు వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. మూర్ఛవ్యాధిగ్రస్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించకుండా.. అసత్య ప్రచారాలా..!

◆ కార్పొరేటర్లనే మభ్యపెడితే ప్రజల సంగతేంటి..? ◆ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కార్పొరేటర్ల ఆగ్రహం

స్టాండింగ్ కమిటీ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కార్పొరేటర్లు

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి కార్పొరేటర్ గురుశేఖర్ బాబు ఈ నెల 4వ తేదీన స్పందనలో ఓ అర్జీని అందజేశారు. సదురు కార్పొరేటర్ అర్జీలు ఇచ్చిన సమస్య పరిష్కారం చేయకుండానే సమస్య పరిష్కరించినట్లు మొబైల్‌కు సంక్షిప్త సందేశం వచ్చింది. దీంతో సదరు కార్పొరేటర్ అవాక్కయ్యారు. ఇదే అంశాన్ని శుక్రవారం నాడు జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో కమిషనర్ మేఘస్వరూప్ దృష్టికి తీసుకెళ్లారు. చేతనైతే సమస్యను పరిష్కరించాలి గానీ, అలాకాకుండా పరిష్కరించినట్లు తప్పుగా మెసేజ్‌లు ఎలా పంపుతారు అంటూ డిప్యూటీ సిటీ ప్లానర్ మారుతి ప్రసాద్‌ను నిలదీశారు. ఈ విషయంపై కలుగుజేసుకున్న కమిషనర్ కార్పొరేటర్ తెలిపిన సమస్యలను పరిశీలించి దానిని పరిష్కరించాలని డిసిపి మారుతీప్రసాద్‌ను ఆదేశించారు.

రూ.14457.61 లక్షల ముసాయిదా బడ్జెట్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ముసాయిదా బడ్జెట్ ప్రతిపాదనను స్టాండింగ్ కమిటీ ఆమోదించింది. బడ్జెట్‌ను రూ.14457.61 లక్షలుగా నిర్ధారించారు. ఎన్నికల కోడ్ రానుండటంతో హడావుడిగా ప్రజా సమస్యలు ఏవీ చర్చించకుండానే స్టాండింగ్ కమిటీలో ముసాయిదా బడ్జెట్‌ను ఆమోదించి గవర్నమెంట్ ఏజెన్సీలు గతంలో నిర్వహించిన శిక్షణ తరగతుల బిల్లుల చెల్లింపునకు మాత్రమే స్టాండింగ్ కమిటీ సమావేశం ఉపయోగపడింది. నగరంలో కొత్త ఊరులోని ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులకు వాటర్‌గేజ్ మిషన్లను అమర్చాలని సభ్యులు కోరారు. పారిశుధ్య పనులు మెరుగుపరచడానికి పుష్కర్లు కొత్తవి కొనుగోలు చేయాలని, మినీ జెసిబి మిషన్లను వినియోగంలోకి తేవాలని కోరారు. స్లీపింగ్ మిషిన్లు మరమ్మతులు లేక మూలన పడ్డాయని వాటిని వినియోగంలోకి తేవాలన్నారు. కంపోస్ట్ యార్డు నిరంతరం తగలబడుతూ ఉందని దానికి సంబంధించి చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఇంజినీర్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో అక్కడ బోరు వేసి పైపులు అమర్చి రింగులర్లు ఏర్పాటు చేశామన్నారు. కంపోస్ట్ యార్డు తగలబడుతుండడంపై సమావేశంలో పూర్తి స్థాయి పరిష్కారంపై పాలకవర్గం, అధికారులు చర్చించకుండా మౌనముద్ర వహించడం కొసమెరుపు. స్టాండింగ్ కమిటీ సభ్యురాలు ముంతాజ్ మాట్లాడుతూ నెలకోసారైనా ప్రధాన కాలువల్లో పూడిక తీయించాలని, లేకుంటే 2022 నవంబర్‌లో వచ్చిన వరదలు మరోసారి వస్తే ప్రాణ, ఆస్తి నష్టం వాటిలే అవకాశం ఉందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

షికారీలకు ఇళ్ల పట్టాలు అందజేత

షికారీలకు ఇళ్ల పట్టాలను అందిస్తున్న ఎస్పీ, జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని షికారీలకు అధికారులు ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నాడు నగరంలోని ఎన్టీఆర్ కాలనీలో పరివర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 65 మంది షికారీలకు ఇళ్ల పట్టాలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ, జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఇంటి పట్టాలు అందించామని, దానిని అమ్ముకోకూడదన్నారు. అందరూ ఇంటి నిర్మాణం చేపట్టి అక్కడ నివాసం ఉండాలన్నారు. షికారీలు ఆరు మందితో కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఏదైనా సమస్య వస్తే ఆ కమిటీ వారు అధికారుల దష్టికి తెస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలియజేశారు. షికారీల పిల్లల కోసం ఉదయం, సాయంత్రం ట్యూషన్లను కొంతమంది దాతల సాయంతో ఏర్పాటు చేశామన్నారు. షికార్లీ ఇళ్ల నిర్మాణాలకు ఆర్డీటీ సహకారం అందిస్తామని తెలియజేసిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని షికారీలు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జి.వెంకటేష్, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, డీఎస్పీ వీర రాఘవరెడ్డి, సిఐ విశ్వనాథ్ చౌదరి పాల్గొన్నారు.

జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్‌గా వి.రామచంద్రారెడ్డి

నియామక ఉత్తర్వులను అందుకుంటున్న వి.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్‌గా నార్పల మండల దగ్గుమర్రి గ్రామానికి చెందిన వి.రామచంద్రా రెడ్డి నియమితు లయ్యారు. కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ ఆయనకు శుక్రవారం నాడు నియామక ఉత్తర్వు పత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు ఉత్తర్వులను అందజేశామని తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయం, రైతుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలియజేశారు.

వేతనాలు చెల్లించేంత వరకూ సమ్మె

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు చెల్లించేంత వరకూ సమ్మె కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ హెచ్చరించారు. శుక్రవారం పంప్‌హౌస్ వద్ద కార్మికులు చేపడుతున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబాల జీవనం ఎలా గడుస్తుందని ప్రశ్నించారు. గతంలో కూడా దశలవారీగా సమ్మె చేస్తే వేతనాలు చెల్లిస్తామని చెప్పి చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఇదివరకే ఎంపీ తలారి రంగయ్య వేతనాలు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని మండిపడ్డారు. ప్రభుత్వం కార్మికులను అడుగడుగునా మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేసవిలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోండి

కలెక్టర్ ఎం.గౌతమికి సిఐటియు నాయకులు జి.ఓబులు వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులకు గత సమ్మె సమయంలో సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి నిలుపుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమికి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వాట్సప్ ద్వారా కలెక్టర్ విజ్ఞాపన పత్రాన్ని పంపించారు. శ్రీరామిరెడ్డి, శ్రీ సత్యసాయి, సి పిడబ్లయు వాటర్ సప్లయ్ కార్మికులకు బకాయి వేతనాలు, పియఫ్ చెల్లించాలన్నారు. అక్రమంగా కాంట్రాక్టర్ కార్మికుల వేతనంలో రూ.3500 కోత విధించారని, తక్షణమే ఆ డబ్బులు కార్మికులు చెల్లించి, లీటర్ కిలో విధానం రద్దు చేయాలన్నారు. 1200 మంది కార్మికుల కుటుంబాల జీవితాలను దృష్టిలో ఉంచుకుని బకాయి పడ్డ వేతనాలు తక్షణమే చెల్లించాలన్నారు. లేని పక్షంలో 25వ తేదీ నుంచి మరోసారి కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళుతున్నారని తెలిపారు. సమస్య పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

డిఇఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రభుత్వ సిఫార్సు బదిలీలను రద్దు చేయాల్సిందే..

డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నాలో యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కౌన్సిలింగ్ విధానాన్ని అపహాస్యం చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రభుత్వ సిఫార్సు బదిలీలను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య అన్నారు. శుక్రవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పోరాటాల ద్వారా సాధించుకున్న కౌన్సిలింగ్ విధానాన్ని అపహాస్యం చేస్తూ ప్రభుత్వమే సిఫార్సు బదిలీలు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. అక్రమ బదిలీల వలన రాజకీయ ఆర్థిక బలం ఉన్నవారు దగ్గర ప్రాంతాలకు ప్రభుత్వ బదిలీలను చేస్తే చాలా కాలం పాటు గ్రామీణ ప్రాంతాలలో పని చేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఎన్ని రోజులు దూర ప్రాంతాలలో పని చేయాలని ప్రశ్నించారు. పరీక్షలు జరుగుతున్న సమయంలో ఈ విధంగా సిఫార్సు బదిలీలు చేయడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందా అని ప్రశ్నించారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు, హిందీ, తెలుగు పండిట్ల ప్రమోషన్లు, వివిధ జిల్లాలలో పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వటానికి నిబంధనలు ఆటంకంగా ఉన్నాయని అధికారులు చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. మరి కౌన్సిలింగ్‌తో సంబంధం లేకుండా సిఫార్సు బదిలీలు చేయడానికి ఏ నిబంధనలు ఆటంకం కావడం లేదా అంటూ ప్రభుత్వ వైఖరిని నిలదీశారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల కోరిక మేరకే బదిలీలు చేస్తున్నామన్న ప్రభుత్వం, అదే ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు వద్దని చెబుతున్న 117 జిఒను అప్రెంటీస్ విధానాన్ని ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. సుమారు 1200పైగా ప్రభుత్వం ఈ విధంగా సిఫార్సు బదిలీలు చేయడం విద్యారంగానికి మాయని మచ్చగా మిగిలిపోతుందని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరిగే కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడిచే ప్రభుత్వ సిఫార్సు బదిలీలు వెంటనే రద్దు చేయాలని, లేకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు దేవేంద్రమ్మ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, వివిధ మండలాల నాయకులు వీరేశ్వరాచారి, మహమ్మద్ గౌస్, మహమ్మద్ జిలాన్, బాబురావు, పవన్ కుమార్, గంగాధర్, ఆదిశేషయ్య, వెంకట నాయుడు, ఓబులపతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-గుంతకల్లు

మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులురెడ్డి

అధికారులు, సిబ్బంది ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ శ్రీనివాసులురెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గుంతకల్లు, గుత్తి, పామిడి పట్టణ, మండలాల కమిషనర్లు, తహశీల్దార్లు, పోలీసు, రెవెన్యూ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూట్, సెక్టార్, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సెక్టార్ పరిధిలోని పోలింగ్‌కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. అదేవిధంగా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ర్యాంపు వంటి సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. విలేజ్ అసెస్‌మెంట్ రిపోర్టులు తయారు చేసుకోవాలని సూచించారు. నియోజకవర్గవ్యాప్తంగా 276 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మోడల్ కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఎన్నికల్లో కోడ్ అమలులోకి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, గుంతకల్లు తహశీల్దార్ శేషఫణి, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల తహశీల్దార్లు, పోలీసు అధికారులు, ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు పాల్గొన్నారు.

పౌరసత్వ చట్టాన్ని రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు

నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

మత ఆధారిత పౌరసత్వ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన మత ఆధారిత పౌరసత్వ చట్టాన్ని (సిఎఎ) వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలిలో సిపిఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన సిఎఎ చట్టం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతాల మధ్య చిచ్చుపెడుతూ, ఒక వర్గాన్ని రెచ్చగొడుతూ రాజకీయంగా లబ్ధి పొందాలని కుట్రలు పన్నుతోందన్నారు. మతతత్వ రాజకీయాలకు సిపిఎం పూర్తిగా వ్యతిరేకమన్నారు. ప్రజలు కూడా దీన్ని వ్యతిరేకించాలని కోరారు. ప్రజల కనీస అవసరాలు, అధిక ధరలు నిరుద్యోగం, ఎలక్ట్రోరల్ బాండ్లు, వివిధ అంశాల నుంచి ప్రజలను పక్కదోవ పట్టించి కేవలం మతం గురించి చర్చ జరిపి రాజకీయంగా లబ్ధి పొందాలని బిజెపి భావిస్తుందన్నారు. వీటిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు సాకే నాగరాజు, దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, చౌక్కా సునీల్, సురేంద్ర, జాకీర్, అబ్దుల్, సురేంద్ర, చంద్ర, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును సిఎం చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-గార్లదిన్నె

ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

చిన్న, చిన్న విభేదాలను పక్కన పెట్టి చంద్రబాబును సిఎంను చేయడమే లక్ష్యంగా పని చేద్దామని టిడిపి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నియోజకర్గంలో వర్గ విభేదాలకు తావు లేకుండా అందరం కలిసి పనిచేద్దామన్నారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ఎమ్మెల్యే, ఆమె భర్త, బంధువులు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ఎలాంటి అభివృద్ధి పనులూ చేయలేదన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి పోయిందని తెలిపారు. ఈసమయంలో రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును సిఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపిని అధికారంలోకి వచ్చేందుకు సైనికుల్లా పని చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, నాయకులు చల్లా నాగరాజు, రాజు, సామల మధు, నాగభూషణ, శ్రీనివాసనాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనోధైర్యాన్ని పెంపొందించేందుకే 'ప్రజ్ఞ వికాస్'

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దార్థ్, యుటిఎఫ్ నాయకులు తిరుపతయ్య

ప్రజాశక్తి-ఉరవకొండ

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు

విద్యార్థుల్లో మనోధైర్యాన్ని నింపేందుకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రజ్ఞ వికాస పరీక్షలు నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిద్దార్థ, యుటిఎఫ్ నాయకులు తిరుపతయ్య తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఫిబ్రవరి 10న ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞా వికాస్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఇందులో భాగంగా అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'అధ్యయనం-పోరాటం' అనే లక్ష్యాలతో భారత విద్యార్థ ఫెడరేషన్ విద్యార్థుల కోసం కేవలం పోరాటాలు మాత్రమే కాకుండా వాళ్లలో ఉండే ప్రతిభను వెలికితీసేందుకే ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలు భవిష్యత్తులో రాబోయే 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధించేందుకు తోడ్పడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నాగభూషణ్, రంగస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సోము, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష కార్యదర్శులు, హిరణ్య, నందు, నాయకులు సతీష్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు అభివృద్ధికి 'ఎ' గ్రేడ్ దోహదం

విసి జివిఆర్, న్యాక్ పీర్ కమిటీ సభ్యులు టి.త్యాగరాజన్

ప్రజాశక్తి-అనంతపురం



న్యాక్ పీర్ కమిటీ సభ్యులు టి.త్యాగరాజన్‌ను సన్మానిస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

న్యాక్ పీర్ కమిటీ ఎ గ్రేడ్ ఇవ్వడం ద్వారా జెఎన్‌టియు అభివృద్ధికి దోహదపడుతుందని వైస్‌ఛాన్స్‌లర్ జివిఆర్ శ్రీనివాసరావు, న్యాక్ పీర్ కమిటీ సభ్యులు టి.త్యాగరాజన్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం వర్సిటీ ఉపకులపతి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జెఎన్‌టియును న్యాక్ పీర్ కమిటీ అన్నిరకాల మౌలిక సదుపాయాలను పరిశీలించిన తర్వాతే ఏ గ్రేడ్ ఇచ్చిందన్నారు. ఎ గ్రేడ్ వచ్చినందుకు యూనివర్సిటీ సిబ్బంది టి.త్యాగరాజన్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎఇ.విజయకుమార్, రిజిస్ట్రార్ సి.శశిధర్, డైరెక్టర్ జి.వి.సుబ్బారెడ్డి, డైరెక్టర్లు వి.సుమలత, ఇ.కేశవరెడ్డి, కిరణ్మయి, బి.దుర్గాప్రసాద్, ఎ.సురేష్‌బాబు, పద్మ సువర్ణ, సి.శోభాబిందు, వి.బి.చిత్ర, బి.ఈశ్వర్‌రెడ్డి, ఎన్.విశాలి, పి.సుజాత, అనంతపురం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, భువనవిజయ, పి.ఆర్.భానుమూర్తి, బి.చంద్రమోహన్‌రెడ్డి, దిలీప్‌కుమార్, ఎ.పి.శివకుమార్, బాల నరసయ్య, కె.మాధవి, ఎస్.శారద, అరుణ, అంకారావు, కళ్యాణ్‌కుమార్, మహేష్, భారతి, కళ్యాణి రాధ, మమత, అజిత, ఫైనాన్స్ ఆఫీసర్ శిరాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అటల్ టింకరింగ్ వర్క్‌షాపు

స్థానిక జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఇఇఇ విభాగంలో మూడు రోజులపాటు జరిగిన అటల్ టింకరింగ్ ల్యాబ్ వర్క్‌షాపు శుక్రవారం ముగిసింది. శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిన సందర్భంగా బిసిడిఇ సెక్రటరీ, సిఇఒ దేవకుమార్, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిసిడిఒ విశ్వవిద్యాలయ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, యూనిసెఫ్ కన్సల్టెంట్ సుదర్శన్, విజ్ఞాన్ అశ్రం ప్రతినిధులు కిషోర్ గైక్వాడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతు : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు

ఆందోళన చేస్తున్న సిపిఎంనాయకులు

దేశవ్యాప్తంగా బిజెపి అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఢిల్లీలో రైతులు చేస్తున్న పోరాటానికి ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రైతుసంఘాలు ఢిల్లీలో చేస్తున్న ఆందోళనకు సంఘీభావంగా గురువారం స్థానిక సిపిఎం కార్యాలయం కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి రైతాంగానికి రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, రద్దు చేసిన నల్లచట్టాల విధానాలనే దొడ్డిదారిలో అమలుకు ప్రయత్నం చేస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని అదానీ, అంబానీ తదితర కార్పొరేట్ కంపెనీల హస్తగతం చేయడానికి కంకణం కట్టుకుందన్నారు. ఈ ఏడాది బడ్జెట్ కేటాయింపులు కూడా అలాగే ఉన్నాయన్నారు. ఎరువులపై సబ్సిడీల కోత విధించడం, ఆహార భద్రత చట్టం అమలుకు నిధుల్లో కోత విధించడం, కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ప్రకటించారన్నారు. ఇలాంటి స్థితిలో మరోమారు దేశవ్యాప్తంగా రైతాంగ, వ్యవసాయ కార్మికులు ఢిల్లీలో భారీ బహిరంగ సభకు పిలుపునిచ్చాయన్నారు. వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని కాపాడుకోవాలంటే మోడీ, వారి మిత్రులను ఓడించాలన్నారు. అప్పుడే రైతాంగం కోరుతున్న చట్టాలు సాధించగలమన్నారు. ఇందులో భాగంగా ఢిల్లీ రైతులకు మద్దతుగా 14న మండల, జిల్లాకేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, సభలు జరపాలని సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ల సమన్వయ కమిటీలు పిలుపునిచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కసాపురం రమేష్, సాకే నాగరాజు, మారుతీప్రసాద్, డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ప్రతాప్, సురేంద్రబాబు, నాయకులు షాషా, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల రైతులు మెళకువలు పాటించాలి

రేకులకుంట పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుబ్రమణ్యం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సుబ్రమణ్యం

పండ్లతోటలు సాగు చేసిన రైతులు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు, మెళకువలను పాటించి అధిక దిగుబడులు సాధించాలని రేకులకుంట పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం మండలంలోని బాటలో కొత్తపల్లిలో రైతులు సాగు చేసిన బత్తాయి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బత్తాయి పంటలో బెట్ట సమయంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. మొక్కల అకులు, ఇతర చెత్త పదార్థాలు చెట్ల పాదులలో పరిచి తేమను కాపాడుకోవాలన్నారు. ఒక్కోచెట్టుకి 100-110 లీటర్ల నీరు అవసరమన్నారు. చీనీ, నిమ్మ తోటల్లో ఎరువుల యాజమాన్యం చాలా కీలకమైందన్నారు. ముఖ్యంగా వేరుకుళ్ల తెగులు నివారణకు తెగులు సోకిన చెట్టుకు నీరు పెట్టిన మరుసటి రోజు ఒక శాతం బోర్డు మిశ్రమం లేదా కార్బన్‌డిజం రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి 20 లీటర్ల నీరు ఒక చెట్టుకు చెట్ల పాదిలో పోయాలన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే నీరు పెట్టిన మరుసటి రోజు మ్యాన్కోజెబ్ రెండు గ్రాములు, ఒక లీటర్ నీటి కలిపి 25 లీటర్లు చొప్పున ఒక చెట్టుకు చెట్లపాదిలో పోయాలన్నారు. అలాగే బంక తెగులనివారణకు పంగళ్లలో బంక కారినప్పుడు ఫాలిక్యూర్ 2 ఎంఎల్ లీటర్ నీటికి లేదా కాంటాఫ్ 2 ఎంఎల్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పొలుసు పురుగు నివారణకు మినరల్ ఆయిల్‌ను 4ఎంఎల్‌ను ఒక లీటర్ నీటితో పాటు షాంపూను 3 నుంచి 5 ఎంఎల్ 1 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. ముఖ్యంగా వేసవిలో నీరు తక్కువ ఉన్న సమయంలో తోటలకు తెగుళ్ల తొలిదశలో ఉన్న చెట్ల మొదలు చుట్టూ రెండు ఆకులు వరి, వేరుశనగ పప్పు, పెసర, మినుము పొట్టుతో 20-30 కిలోలను 2 నుంచి 3 అంగుళాల మందంగా పరిచి నేలలోని తేమను కాపాడుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి : ఐసిడిఎస్ పీడీ

ప్రజాశక్తి-నార్పల

మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి

పోషకాహారంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పీడీ డాక్టర్ బిఎన్ శ్రీదేవి సూచించారు. పోషణ్ పక్వాడ్‌లో భాగంగా మండల కేంద్రంలోని బాలికల హైస్కూల్‌లో పౌష్టికాహారంపై, బాలికను రక్షించు.. బాలికను చదివించు అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలతోపాటు బాలింతలు, గర్భిణులు రోజూ సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బాలామృతంతో పోషక విలువలు సమృద్ధిగా అందుతాయన్నారు. కాగా బాల్య వివాహాలను నివారించడంలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. మన ఇంట్లో.. మన చుట్టుపక్కల.. మన బంధువుల ఇళ్లలో ఎవరికైనా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆర్.మంజునాథ్, లో సిడిపిఒ భారతి, సూపర్‌వైజర్లు మధుమాలిని, సునాలిని, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి, ఓఆర్‌డబ్ల్యు రమాదేవి, కౌన్సిలర్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతకల్లు : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ఎన్.ఢిల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కసాపురం అంగన్వాడీ 3వకేంద్రంలో పక్వాడా పోషణ (పౌష్టికాహారం)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన రోజు నుంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత ఉన్న గర్భిణులు ఐరన్ మాత్రలు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. వీటితోపాటు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే బియ్యం, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అప్పుడే తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో పౌష్టికాహారం తింటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు పుష్పావతి, కృష్ణవేణి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, మహిళా సాధికారత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

మాట్లాడుతున్న ప్రొఫెసర్ వింగ్ అధ్యక్షురాలు తేజస్విని

మాజీ సీఎం చంద్రబాబు నాయుడుతోనే మహిళల సాధికారత సాధ్యమవుతుందని ప్రొఫెసర్ వింగ్ అధ్యక్షురాలు పొడిపాటి తేజస్విని అన్నారు. శుక్రవారం టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో పట్టణంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం చంద్రబాబు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. డ్వాక్రా సంఘాలు ఏర్పాటు చేసి మహిళల్లో దేశంలో ఎక్కడా లేని విధంగా చైతన్యం తెచ్చారన్నారు. మహిళలకు రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పించి ప్రజాప్రతినిధులుగా ఎదగనివ్వడంతోపాటు అనేక పదవులు కట్టిబెట్టారన్నారు. విద్య రాజకీయ సామాజిక రంగాల్లో ప్రత్యేక ప్రార్థన ఇస్తూ మహిళలకు పెద్దపీట వేశారని తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మహిళలు అన్నిరంగాల్లో సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే మరోసారి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కావున ప్రతి మహిళ ఓ శక్తిగా ఎదిగి గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో గోళ్ల సర్పంచి కవితా బుజ్జన్న, మాజీ కౌన్సిలర్ అమర, బిందు, రాజశేఖర్, మాజీ ఎంపిపిలు, జడ్పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల పరిరక్షణకు పోరాటాలే మార్గం

జెవివి నగర గౌరవాధ్యక్షులు పి.ప్రసూన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మాట్లాడుతున్న జెవివి నగర గౌరవాధ్యక్షులు పి.ప్రసూన

మహిళల హక్కుల పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలే మార్గమని జన విజ్ఞాన వేదిక నగర గౌరవాధ్యక్షులు పి.ప్రసూన అన్నారు. శుక్రవారం జెవివి నగర కమిటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ట్స్ కళాశాల బాలిక హాస్టల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళల అనుభవిస్తున్న హక్కులు పోరాటంతో సాధించుకున్నవేనని తెలిపారు. ఒకప్పుడు మహిళలకు ఎటువంటి హక్కులు ఉండేవి కావని, పురుషులతో పాటు మహిళలకు కూడా సమాన హక్కులు కావాలని చేసిన పోరాటంలో దాదాపుగా 146 మంది మహిళలు తమ ప్రాణాలను కోల్పోయారని తెలిపారు. మార్చి 8న జరగడంతో 1975లో ఐక్యరాజ్య సమితి మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించడం జరిగిందన్నారు. ఎంతో పోరాటం చేసి మహిళలు సమాన హక్కులు సాధించుకున్నప్పటికీ ప్రభుత్వాలు వాటిని అమలు చేసే విషయంలో విఫలమవుతున్నాయని తెలిపారు. నేటి విద్యార్థినులె రేపటి నాయకురాళ్లని ఐక్యమత్యంతో చేసే పోరాటాలతోనే తమ హక్కులు నిలుపుకోవాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల తెలుగు అధ్యాపకురాలు హేమామాలిని, సత్య సాయి కళాశాల తెలుగు అధ్యాపకురాలు యమునా రాణి, సమత జిల్లా కన్వీనర్ విజయలక్ష్మి, సమతా నాయకులు రాధా, లక్ష్మి, శశికళ, రాజ్యలక్ష్మి, జన విజ్ఞాన వేదిక నగర కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రతను కాపాడుకుందాం

సిఎఎ చట్ట పర్యావసానాలపై సిపిఎం విస్తృత ప్రచారం

ముస్లిములకు ప్రజాశక్తి ప్రత్యేక సంచికను అందజేస్తున్న సిపిఎంనాయకులు

అనంతపురం కలెక్టరేట్ : రాజ్యాంగానికి విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిఎఎ చట్టాన్ని వ్యతిరేకించి దేశ సమగ్రతను కాపాడుకుందామని సిపిఎం నగర 1వ కమిటి కార్యదర్శి వి.రామిరెడ్డి అన్నారు. శుక్రవారం సిఎఎం చట్టం అమలు దాని పర్యావసానాలపై సిపిఎం ఆధ్వర్యంలో నగరంలో విస్తృ ప్రచారం నిర్వహించారు. మసీదులు, చర్చిల వద్ద ప్రత్యేకంగా ప్రచురించిన సిఎఎ సంచికను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా సిఎఎ చట్టాన్ని దొడ్డిదారిన ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. దీని వల్ల దేశ సమగ్రతకు భంగం వాటిల్లుతుందన్నారు. లౌకిక రాజ్యాంగ దేశంలో ఇలాంటి ఏకపక్ష సిఎఎ చట్టాలు అమలు సరికాదన్నారు. తక్షణమే సిఎఎను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1, 2 రోడ్డు, పొట్టిశ్రీరాములు కాలనీ, ప్రత్యేక సంచికను పంపిణి చేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటి నాయకులు వలి, ప్రకాష్, జీవరత్నం, వెంకటనారాయణ, మసూద్, ముస్కిన్, నూరుల్లా, ఎస్కె మహమ్మద్, ఇస్మాయిల్, ఫక్కృ, మహేష్, ఫయాజ్, జిలాన్, రామాంజి, చాంద్, మాబాషా, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో ప్రజాశక్తి సంచికను చదువుతున్న ముస్లిములు

నార్పల : సిఎఎకు వ్యతిరేకంగా ప్రజాశక్తి దినపత్రిక ముద్రించిన ప్రత్యేక సంచికలను శుక్రవారం మండల కేంద్రంలోని జామియా మసీదు, ఈద్గా మసీదు, మక్కా మసీదులో నమాజ్ అనంతరం ముస్లిము సోదరులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముతవల్లి శంషుద్దీన్ మాట్లాడుతూ కుటిల రాజకీయాల కోసం అన్నదమ్ముల్లా కలిసి ఉన్న భారతీయుల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్న రాజకీయ పార్టీల స్వార్థ ఆలోచనలను భారతీయులు అందరూ ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలకు అడుగులు, మడుగులొత్తే విధంగా వ్యవహరిస్తున్నాయని వాపోయారు. ప్రస్తుత రాజకీయ పార్టీలు వారి స్వార్థ రాజకీయం కోసం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ దేశంలో లౌకికతత్వం లేకుండా చేసేందుకు పూనపుకున్నాయన్నారు. వీటిని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ఎన్ఎస్ఎస్ శిబిరంలో విద్యార్థులు

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారులు మాట్లాడుతూ ఈనెల 9వ తేదీ నుంచి ఏడు రోజులు పాటు పెద్దవడుగూరు మండలం గుత్తి-అనంతపురం గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా శ్రమదానం, ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ విద్యా ప్రాముఖ్యతపై అవగాహన, మొక్కలు నాటి వాటిని ఎలా సంరక్షించాలో ప్రజలకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీ వాణి, ఎండి జి.రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

17న పట్టణ బ్యాంకు సమావేశం

గుత్తి : ఈనెల 17న ది కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంకు సీఈఓ ఎస్.మహేశ్వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో 2024-25 బడ్జెట్ అంచనాలు తోపాటు పలు అంశాలపై తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. కావున పాలకవర్గం, సభ్యులు హాజరు కావాలని కోరారు.

వైసిపిలో 50 కుటుంబాలు చేరిక

తాడిపత్రి రూరల్ : రూరల్ పరిధిలోని గన్నెవారిపల్లి కాలనీకి చెందిన 50 కుటుంబాలు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో శుక్రవారం వైసిపి పార్టీలో చేరాయి. గన్నెవారిపల్లె కాలనీకి చెందిన ప్రదీప్‌రెడ్డి, ఎంపిటిసి నగర రవికుమార్ ఆధ్వర్యంలో కాలనీలోని 50 కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో తాడిపత్రి మరింత అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుట్లూరు : మండల పరిధిలోని కోమటికుంట్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఇ విజయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో నేటి ఉదయం 7నుంచి 11 గంటల వరకూ అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

గవిమఠం బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఉరవకొండ : ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రసిద్ధిచెందిన ఉరవకొండలోని గవిమఠం స్థిత చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం రాత్రి గంగపూజ, కంకణధారణతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఎదురు బసవన్న గుడి వద్ద ప్రధాన అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య గంగపూజ, తదితర పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. అనంతరం కరిబసవేశ్వర స్వామి జీవసమాధి ఉన్న ప్రాంగణంలో నాగపూజ, కంకణధారణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. నేటి నుంచి చంద్రమౌళీశ్వరస్వామి పలు వాహనాల్లో విహరించనున్నారు. ఈకార్యక్రమంలో మఠం సహాయ కమిషనర్ చిట్టెమ్మ, ఏజెంట్ రాజన్నగౌడ్, ప్రధాన అర్చకులు విరుపాక్షయ్యస్వామి, అర్చకులు రాజశేఖర్ స్వామి, కిరణ్, మల్లికార్జున స్వామి, రేవాన సిద్ద, గవిమఠం సిబ్బంది నారాయణస్వామి, మధు, వెంకటేసులు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

స్వీప్‌పై అవగాహన

రాయదుర్గం : పట్టణంలోని శ్రీవ్యాసనికేతన్ పాఠశాలలో క్రమబద్దమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం (స్వీప్)పై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చిట్టెమ్మ, ఎన్నికల సిబ్బంది, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం

వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

తెలుగుదేశం పార్టీతోనే బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని టిడిపి మండల ఇన్‌ఛార్జి బాలాజీ, మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని తలుపూరులో 'బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ఈ సమయంలో చంద్రబాబు రావడం ద్వారానే అభివృద్ధి సాధ్యమన్నారు. కావున వచ్చే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గడిపూడి నారాయణస్వామి, గొరిదిండ్ల అనిల్‌చౌదరి, పరశురాం, కుళ్లాయప్ప, శశాంక్‌చౌదరి, కృష్ణమోహన్‌చౌదరి, వెంకటనారాయణ, సూర్యనారాయణ, కృష్ణగోపాల్‌చౌదరి, శ్రీకృష్ణచౌదరి, సర్దానప్ప, వెంకటరాముడు, ఓబులేష్, మాల నాగన్న, కూడాల చంద్ర, బొజ్జన్న, గొల్ల నారాయణస్వామి, రాజగోపాల్, బిఎల్‌వి నారాయణస్వామి, ఆనంద్, రాజారమేష్‌రాప్తా, బెస్త తిమ్మరాయుడు, నరసింహచౌదరి, శ్రీనివాస్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

మాట్లాడుతున్న వైద్యాధికారి

వైద్యసేవల నిర్వహణలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు పావని, వెంకటేష్‌నాయక్ సూచించారు. శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణులకు బ్యాంక్ అకౌంట్లు ఓపెన్ చేయాలన్నారు. లేకుంటే ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలు పొందలేరన్నారు. అలాగే విలేజ్ హెల్త్, న్యూట్రీషన్ కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. వడదెబ్బ, గర్భస్త లింగ నిర్ధారణ నిరోధక చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి.షఫీ, హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, సిహెచ్ఒ ఎంఎల్ హెచ్‌పిలు భవాని, భారతి, హిమబిందు, హెబ్సిబా, ఏఎన్ఎంలు పద్మావతి, లలిత, సలీమాబేగం, చాముండేశ్వరి, కోమల, అనూషా, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

చీనీలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

చీనీపంటపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చీనీలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చుని ఉద్యాన శాఖ అధికారులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని శుక్రవారం కాలువపల్లి, కోనంపల్లి గ్రామాల్లో రైతులు సాగుచేసిన చీనీ తోటలను ఉద్యాన శాఖ రాష్ట్రస్థాయి బృందం పరిశీలించారు. ఇందులో భాగంగా అక్కడక్కడ వేరు కుళ్లు, ఎండు తెగులు సోకినట్లు గుర్తించారు. బెట్ట పరిస్థితుల నేపథ్యంలో నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తప్పనిసరిగా ఆర్గానిక్ మల్చింగ్ విధానాన్ని పాటించాలన్నారు. దీంతోపాటు ట్రైకోడెర్మా విరిడే సూడోమోనాస్ క్లోరోసిస్ లాంటి తక్కువకు లభించే జీవ నియంత్రణ ఎరువులు, మందులు వాడాలన్నారు. అలాగే చెట్టు మొదలుకు బోడో పేస్టు పట్టించడం, జనుము, జీలుగా, పిల్లి పెసర లాంటి వాటితో పచ్చిరొట్టె పైర్ల ద్వారా భూసారం పెంచుకుంటే చాలా వరకు చీడపీడలు సమర్థవంతంగా నివారించుకోవచ్చన్నారు. తర్వాత ఎం.వెంకటంపల్లిలో ఉన్న ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ ఒఎస్‌డి రమేష్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆఫీసర్ అజయ్ కుమార్, అలెన్ మాథ్యూ, శంకర్‌నాయక్, కృష్ణతేజ, తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్‌తో పేదలకు భరోసా

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ : నిరుపేదల ఆరోగ్యానికి సిఎం జగన్ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా భరోసా కల్పిస్తోందని నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం వజ్రకరూరులో పలువురికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సిఫార్సు మేరకు నియోజకవర్గంలో 14 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ చెక్కులు మంజూరైనటుల తెలిపారు. ఇప్పటి వరకూ నియోజకవర్గంలో రూ.3కోట్లకుపైగా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించినట్లు వివరించారు. కాగా వైసిపి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం విషయంలో పూర్తి భరోసా కల్పిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వీరన్న, కరణం భీమిరెడ్డి, అంపయ్య, సోమశేఖర్‌రెడ్డి, ప్యాపిలి భీమా, కిష్టప్ప, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

అనంతపురం టికెట్‌ను జనసేనకు కేటాయించాలి

ప్రజాశక్తి-అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

జనసేన, టిడిపి, బిజెపి కూటమి పొత్తుల్లో భాగంగా అనంత అర్బన్ టికెట్ జనసేన పార్టీకే కేటాయించాలని జనసేన నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు అంకే ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సప్తగిరి సర్కిల్లో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముందు నుంచీ అనంతపురం అర్బన్ టికెట్ జనసేనకే కేటాయిస్తారని ప్రచారం జరుగుతోందన్నారు. తీరా ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో అభ్యర్థుల ప్రకటన వచ్చేసరికి అనంతపురం అర్బన్ టికెట్ ఇతర పార్టీలకు వెళ్తుందన్న పుకారు కార్యకర్తలు, నాయకులను తీవ్ర ఆవేదనకు గురి చేస్తోందని వాపోయారు. అత్యంత వెనుకబడిన జిల్లాలో జనసేన పార్టీ బతకాలంటే సార్వత్రిక ఎన్నికల్లో కనీసం ఒక స్థానం నుంచైనా ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనసేన జిల్లా అధ్యక్షులుగా, అనంతపురం అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నాయకత్వం వహిస్తున్న టిసి వరుణ్‌కు అవకాశం కల్పించాలని కోరారు. జనసేనకు టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలిపించి జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్‌కు కానుకగా ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కుమ్మర నాగేంద్ర, సంజీవరాయుడు, జయమ్మ, దరాజ్‌బాషా, రాపా ధనుంజయ, ఆవుకు విజయకుమార్, ముప్పూరి కృష్ణ, నగర ఉపాధ్యక్షులు సదానందం, జక్కిరెడ్డి ఆదినారాయణ, నగర ప్రధాన కార్యదర్శులు మేదర వెంకటేష్, హుస్సేన్, దరాజ్‌బాషా, లాల్‌స్వామి, కుమ్మర మురళి, అంజి, సంపత్, నాగార్జున, వల్లంశెట్టి వెంకటరమణ, ఆకుల అశోక్, వీరమహిళ అనసూయ, చిరు, రహీం బాషా, నాగరాజు, నజీమ్, బళ్లారి అనిల్, హీద్యా, వంశీ, హరికృష్ణ, బాషా, హరీష్ (రుద్రంపేట), నగేష్, విజయ రాయల్, ఖాసీం, నౌషాద్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్, కల్వర్టు నిర్మాణాలకు భూమిపూజ

భూమిపూజ చేస్తున్న ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ : పట్టణంలోని ఇందిరానగర్ 8వ లైన్‌లో రూ.2 లక్షలతో చేపట్టిన తాగునీటి పైపులైన్ నిర్మాణానికి వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి వై.ప్రణయ్‌రెడ్డి శుక్రవారం భూమిపూజ చేశారు. అదేవిధంగా 5వలైన్‌లో రూ.2లక్షలతో కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లలిత, ఎంపిపి నరసింహులు, నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, పార్వతమ్మ, అంగడాల గీతా ఆంజనేయులు, వన్నప్ప, చంద్రమ్మ, ఏసీ ఎర్రిస్వామి, బసవరాజు, తిప్పయ్య, ఓబన్న, సుద్దాల వెంకటేష్, జోగి భీమన్న, మల్లికార్జున, పెయింటర్ సీనా, నాగేంద్ర, వెంకటేష్, కొంతం బాబు, కుళ్లాయప్ప, సంజీవులు, డ్రైవర్ సూరి, రజాక్, గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమానికి కృషి

ఉరవకొండ : టిడిపి అధికారంలోకి వచ్చాక చేనేత కార్మికుల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో తొగుటవీర క్షత్రియులు, చేనేత సోదరులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో చేనేత కార్మికులు ఎన్నో ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు, టిడిపి చేనేత విభాగం నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ముగిసిన జాతీయ సేవాశిబిరం

రాయదుర్గం రూరల్ : జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మండల పరిధిలోని కొంతానపల్లి గ్రామంలో ఉన్న కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహించిన ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి మాట్లాడుతూ వాలంటీర్లు వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. సర్పంచి విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తిరుగుతూ వాలంటీర్లు అనేక విషయాలపై ప్రజలను చైతన్యవంతులు చేశారన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు గ్రామంలో చేసేందుకు ముందుకొస్తే సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, బాలనరసింహులు, దేవదాసు రవికుమార్, వెంకటేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రామకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి-పామిడి

మండల కేంద్రంలోని 4వ వార్డులో వెలసిన దుర్గమ్మ జాతర నిర్వహణకు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదేశాల మేరకు గుత్తి మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి రూ.20వేలు ఆర్థికసాయాన్ని శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు ఇన్‌ఛార్జి ఈశ్వర్‌రెడ్డి, మాల మహానాడు అధ్యక్షులు చలపతి, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి పామిడి సూరి, అబ్దుల్, జనార్ధన్‌రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి ఛైర్మన్ మీసాల రామచంద్ర, బోయ వెంకటరాముడు, మహేష్‌రెడ్డి, గొర్ల సుంకన్న, కృష్ణారెడ్డి, రామాంజి, పెద్దకాలువ వినోద్, తుల్జాబాయి, శివయాదవ్, శివ, రాథోడ్, రాజు, శివ, శీన, కొండూరు బబ్బు, కొండాపురం ఖాసీ, ఈశ్వరయ్య, బోయ శంకర, లాలప్ప, గోపాల్, రమేష్, పండు, రాజు, తదితరులు పాల్గొన్నారు.